# పల్లెటూరి వైద్యుడు

ఫ్రాంజ్ కాఫ్కా

అనువాదం: మెహెర్



**అనువాద కథ:** పల్లెటూరి వైద్యుడు

**మూలం:** ఫ్రాంజ్ కాఫ్కా

**అనువాదం:** మెహెర్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: ఏప్రిల్ 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2415

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# పల్లెటూరి వైద్యుడు

ఓ పెద్ద చిక్కొచ్చి పడింది: నేను వెంటనే బయల్దేరాలి; బాగా అనారోగ్యంతో ఉన్న మనిషొకడు ఇక్కడికి పది మైళ్ళ దూరంలో ఓ పల్లెటూళ్ళో నా కోసం ఎదురుచూస్తున్నాడు; మా ఇద్దర్నీ వేరు చేస్తూ దట్టమైన మంచు తుఫాను; నాకో చిన్న గుర్రబ్బండి ఉంది, తేలికైనదీ, ఎత్తయినదీ, మన పల్లెటూరి బాటలకు అనువైనదీను; నేను ఉన్నికోటు తొడుక్కుని, నా సరంజామా ఉన్న సంచీ భుజాన వేసుకుని, వాకిట్లో సిద్ధంగా నిల్చొని ఉన్నాను; కానీ గుర్రం అందుబాటులో లేదు; అవును, గుర్రం లేదు. నా సొంత గుర్రమొకటి నిన్నే చచ్చిపోయింది, ఈ గడ్డకట్టిన శీతాకాలంలో ప్రయాణాల్ని తట్టుకోలేకపోయింది; ప్రస్తుతం వేరే గుర్రం కోసం నా పనమ్మాయి ఊరంతా వెతుకుతోంది; కానీ ప్రయోజనం ఉండదు, నాకు తెలుసు. ఒక్కణ్ణీ అలాగే నుంచున్నాను, అంతకంతకూ నన్ను కదలకుండా చేస్తున్న మంచులో కూరుకుపోతున్నాను. పనమ్మాయి చాలాసేపటికి తిరిగి వచ్చి, గేటు దగ్గర నుంచొని లాంతరు ఊపింది, ఆమె ఒక్కతే వచ్చింది; ఇలాంటి వాతావరణంలో ఎవరు మాత్రం గుర్రం అరువిస్తారు. నేను ఇంకోసారి వాకిట్లో అసహనంగా పచార్లు చేశాను, ఏం చేయాలో పాలుపోలేదు, ఆ నిరాశలో చిరాకులో, చాలాయేళ్ళుగా పాడుబెట్టిన పందులపాక తలుపునొకదాన్ని ఒక్క తాపు తన్నాను, శిథిలమైన ఆ తలుపు తటాల్న తెరుచుకుంది, సీలల మీద అటూ ఇటూ ఊగింది. లోపల్నించి వెచ్చని గాలీ, గుర్రాల వాసనా సోకింది. లోపల ఒక తాడుకి మసక లాంతరు వేలాడుతోంది. చూరు బాగా కిందకు ఉన్న ఆ పాకలో, ఒక వ్యక్తి గొంతుక్కూచున్నాడు, తన నీలి కళ్ళ ముఖాన్ని బయటపెట్టాడు. చేతుల మీదా, మోకాళ్ళ మీదా పాకుతూ బయటకి వచ్చి, "బండి కట్టమంటారా?" అని అడిగాడు. నాకేమనాలో ఏం తోచలేదు, ఆ పందులపాకలో ఇంకా ఏమేం ఉన్నాయా అని తొంగి చూశాను. పనమ్మాయి నా పక్కకు వచ్చి నుంచుంది. "ఒక్కోసారి మనింట్లో ఏం ఉన్నాయో మనకే తెలియదు," అందామె, ఇద్దరం నవ్వుకున్నాం. ఈలోగా ఆ గుర్రాలబ్బాయి, "అన్నాయ్, అక్కాయ్ రండిలా!" అని గట్టిగా అరిచాడు, వెంటనే బలిసిన పిక్కలతో ఉన్న రెండు గుర్రాలు, కాళ్ళను పొట్ట కిందకు ముడుచుకుని, తీరైన తమ తలల్ని ఒంటెల మాదిరిగా వంచి, ఒకదాని వెనక ఒకటి దేక్కుంటూ, గుమ్మాన్ని తమ పృష్టాలతో పూర్తిగా నింపేస్తూ, దాని గూండా అతికష్టం మీద బయటకు వచ్చాయి. వచ్చీరాగానే తమ పొడవాటి కాళ్ళ మీద పూర్తి ఎత్తుకు లేచి నిలబడ్డాయి, వాటి శరీరాల్నుంచి

దట్టమైన ఆవిర్లు లేస్తున్నాయి. పనమ్మాయితో “కాస్త అతనికి సాయం చేయి,” అన్నాను, ఆమె అంగీకారంగా ముందుకు వెళ్ళి గుర్రపుజీను అతనికి అందివ్వబోయింది. ఆమె అలా దగ్గరకు వచ్చిందో లేదో, ఆ గుర్రాలవాడు ఆమె చుట్టూ చేతులు వేసి లాక్కొని, తన ముఖాన్ని ఆమె ముఖం మీదికి వంచాడు. ఆమె వెర్రికేకలు వేస్తూ మళ్ళీ నా వైపు పరిగెత్తుకు వచ్చింది; అప్పటికే ఆమె చెంపల మీద రెండువరసల పంటిగాట్లు కనపడుతున్నాయి. నేను కోపం పట్టలేక “పశువా! ఏం కొరడా దెబ్బలు తినాలనుందా,” అని అరిచాను, కానీ వెంటనే అతనెవరో ఎక్కణ్ణించి వచ్చాడో తెలియదనీ, అందరూ మొండిచేయి చూపించిన చోట అతనొక్కడే సాయపడేందుకు ముందుకొచ్చాడనీ గుర్తొచ్చి, నిగ్రహించుకున్నాను. నా మనసులో ఆలోచనల్ని చదివిన వాడిలా, అతను నా మాటలకి ఏమాత్రం కించపడకుండా, గుర్రాల్ని బండికి కట్టే పనిలో నిమగ్నమైపోయాడు, కాసేపటికి వెనక్కు తిరిగి నా వైపు చూసి, “ఎక్కండి,” అన్నాడు, చూస్తే నిజంగానే బండి అంతా సిద్ధంగా ఉంది. ఇంత మంచి గుర్రాలజోడు నాకెప్పుడూ దొరకలేదు, నేను ఆనందంగా బండి ఎక్కాను. “పగ్గాలు నేను పట్టుకుంటాను, నీకు దారి తెలియదుగా,” అన్నాను. “సరే మీ ఇష్టం, అసలు నేను మీతో రావటం లేదు కదా, ఇక్కడే రోజీతో ఉండిపోతున్నాను,” అన్నాడు. అది వినగానే రోజీ, “వద్దు!” అంటూ అరిచింది, గత్యంతరంలేని విధిని ముందే గ్రహించిన దానిలా, ఇంటి వైపు పరిగెత్తింది; లోపల్నించి ఆమె గొళ్ళెం వేస్తున్న గరగరలు వినపడ్డాయి, తాళం తిరిగిన చప్పుడు వినపడింది. హాల్లో లైట్లు ఆర్పడమూ, అతనికి దొరక్కుండా దాక్కోవటానికి ఇంటి లోపలిగదుల్లోకి పరిగెత్తడమూ అంతా తెలుస్తోంది. నేను ఆ గుర్రాలవాడితో “నువ్వు నాతో రాక తప్పదు! అవతల ఆలస్యమైతే అయింది గానీ, నా ప్రయాణం కోసం ఆ పిల్లను మాత్రం బలిపెట్టను,” అన్నాను. వాడు “హెయ్య!” అని అరిచి చప్పట్లు కొట్టాడు, వరద లాక్కున్న కలపదుంగలాగా చప్పున కదిలింది గుర్రబ్బండి; ఓపక్క ఆ గుర్రాలవాడి దాడికి నా ఇంటి తలుపు ముక్కలుచెక్కలవటం ఇంకా వినిపిస్తూనే ఉంది, ఈ లోగా నా కళ్ళనూ చెవుల్నూ ఒరుసుకుపోతూ ఏదో హోరు మొదలై నా సర్వేంద్రియాల్నీ ముట్టడించింది. కానీ క్షణం పాటు మాత్రమే. ఆ మరుక్షణం, నా ఇంటిగేటుని ఆనుకునే రోగి ఇల్లు ఉందన్నట్టు, అక్కడ ఉన్నాను; గుర్రాలు నెమ్మదించి ఆగి నిలబడ్డాయి; మంచు కురవటం ఆగిపోయింది; అంతా వెన్నెల పరుచుకుని ఉంది; రోగి తల్లిదండ్రులు ఇంట్లోంచి పరుగుపరుగున బయటకు వచ్చారు, వెనకనే అతని చెల్లి కూడా వచ్చింది; వాళ్ళు నన్ను గుర్రబ్బండి

నుండి దింపి దాదాపు మోసుకెళ్తున్నట్టే తీసుకుపోయారు; వాళ్ళు కంగారుగా చెప్తున్న రోగం గురించి చెప్తున్న వివరాలేవీ నాకు అర్థం కాలేదు; రోగి ఉన్న గది ఊపిరాడనంత ఉబ్బరంగా ఉంది; ఓ మూల పాడుపడిన పొయ్యి నుంచి పొగ లేస్తోంది; ముందు, కిటికీలు తెరవాలనిపించింది; కానీ అంతకన్నా ముందు నా రోగిని ఒకసారి చూడాలనిపించింది. అతను సన్నగా ఉన్నాడు, జ్వరంతో లేడు, చల్లగా లేడు, అలాగని వెచ్చగానూ లేడు, నిస్తేజమైన కళ్ళతో చూస్తున్నాడు, వంటి మీద చొక్కా లేదు, నన్ను చూడగానే ఆ అబ్బాయి మంచం పైన లేచి కూర్చుని, నా మెడ చుట్టూ చేతులు వేసి, చెవిలో ఇలా గొణిగాడు: “డాక్టర్, నన్ను చచ్చిపోనీయండి.” నేను వెనక్కి తిరిగి చూశాను; ఎవరికీ అతని మాటలు వినపడలేదు; అతని తల్లిదండ్రులు ముందుకు వంగి నేను చేయబోయే రోగనిర్ధారణ కోసం నిశ్శబ్దంగా ఎదురుచూస్తున్నారు; అతని చెల్లెలు పీట తెచ్చి వేసింది. దాని మీద నా సంచిని పెట్టి, దాన్ని తెరిచి, నా సామాగ్రి అంతా ఓ సారి వెతికాను; ఆ అబ్బాయి తన విన్నపాన్ని మళ్ళీ గుర్తు చేయటానికన్నట్టు మంచం మీంచే నా వైపు సైగలు చేస్తున్నాడు; నేను ఒక చిన్నపట్టకారు బయటకు తీశాను, దాన్ని కొవ్వొత్తి వెలుగులో పరీక్షించాను, మళ్ళీ కిందపెట్టేశాను. దైవాన్ని తిట్టుకుంటూ అనుకున్నాను, “అవును, దేవతలు కూడా పోయి పోయి ఇలాంటి కేసుల విషయంలోనే సాయం చేస్తారు, దీని కోసం గుర్రాన్ని కూడా సరఫరా చేస్తారు, సమయం తక్కువ కాబట్టి రెండో గుర్రాన్ని కూడా జత చేస్తారు, అదిచాలదన్నట్టు గుర్రాలవాణ్ణి కూడా ఏర్పాటు చేస్తారు——” ఇప్పుడే నాకు మళ్ళీ రోజీ గుర్తొచ్చింది; ఏం చేయగలను, ఆ గుర్రాలవాడి చేతుల్లో నలిగిపోకుండా ఆమెను ఎలా బయటపడేయగలను, ఈ అదుపులేని గుర్రాలు లాగే బండి మీద వెళ్ళి పదిమైళ్ళ అవతల ఉన్న ఆమెను ఎలా కాపాడగలను? ఇంతకీ ఆ గుర్రాలు పగ్గాలు తెంచుకున్నట్టున్నాయి; ఎలాగో తెలియదు గానీ, బయట నుంచి ఈ గది కిటికీని తెరిచాయి; ఆ కంతలోంచి తలల్ని లోపలికి దూర్చాయి, ఇదంతా చూసి ఓపక్క రోగి కుటుంబం పొలికేకలు పెడుతున్నా అవి మాత్రం తమకేం పట్టనట్టు రోగి వంక చూస్తున్నాయి. “వెంటనే వెనక్కు వెళ్ళిపోవాలి,” అనుకున్నాను, అక్కడికేదో ఆ గుర్రాలు నన్ను తిరుగు ప్రయాణానికి ఆదేశిస్తున్నట్టు. అలా అనుకున్నానే గానీ మళ్ళా రోగి చెల్లెలు, నేను ఉక్కిపోతున్నాను అనుకొని కాబోలు, నా ఉన్నికోటు తీస్తుంటే మారుమాట్లాడకుండా తీయనిచ్చాను. నా ముందు ఓ గ్లాసు రమ్ము ప్రత్యక్షమైంది, పెద్దాయన భుజం మీద చరిచాడు, అతని సంపదని నాతో పంచుకోవడం వల్ల

కలిగిన చనువు. నేను తల విదిలించాను; ఆ పెద్దాయన ఆలోచనల ఇరుకు మేరల్లో చిక్కుకుపోవటం చిరాగ్గా అనిపించింది; ఆ కారణంగానే డ్రింకు వద్దన్నాను. తల్లి బాబ్బాబూ అన్నట్టుగా అబ్బాయి వైపు చూపించింది; నేను తల ఊపి, గుర్రాల్లో ఒకటి బిగ్గరగా సకిలిస్తుండగా, నా తలను ఆ అబ్బాయి రొమ్ము కేసి ఆనించాను, నా తడి గడ్డం తాకగానే వణికాడు. చివరకు నేను అనుకున్నదే అయింది: ఆ అబ్బాయి ఆరోగ్యానికి వచ్చిన లోటేమీ లేదు, రక్తప్రసరణ కాస్త మందకొడిగా ఉందంతే, తల్లి తన గాభరా కొద్దీ ఇచ్చిన కాఫీ దానికి తోడైనట్టుంది, అదొక్కటీ తప్పించి నిక్షేపంగా ఉన్నాడు, ఒక్క తాపు తన్నితే చాలు, మంచం మీద నిటారుగా లేచి కూర్చుంటాడు. కానీ ప్రపంచాన్ని ఉద్ధరించటమే నా పని కాదుగా, కాబట్టి అతణ్ణి అలాగే వదిలేశాను. నేను ఈ తాలూకా మొత్తానికి వైద్యుణ్ణి, ఒక్క మనిషి వల్ల కానంత పని చేస్తాను. జీతం తక్కువే అయినా, ఆ పట్టింపేమీ లేకుండా పేదల మీద ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తాను. కానీ ప్రస్తుతం రోజీ క్షేమంగా ఉందో లేదో చూడాలి, అప్పుడే ఈ అబ్బాయి సంగతి. ఆ తర్వాత ఇక నేను చచ్చిపోయినా ఫర్లేదు. ఈ అంతూపొంతూ లేని శీతాకాలం అంతకుమించి ఏం చేయగలను! నా గుర్రమా చచ్చిపోయింది, ఊరిలో గుర్రం అరువిచ్చేవాడు ఒక్కడు కూడా లేడు. ఇప్పుడున్న జోడీని కూడా నేను పందుల పాక నుంచి తెచ్చుకోవాల్సి వచ్చింది; అక్కడ అదృష్టవశాత్తూ గుర్రాలు ఉండబట్టి సరిపోయింది గానీ, ఒకవేళ అక్కడ పందులు ఉండుంటే వాటితోనే పని కానిచ్చేయాల్సి వచ్చేది. అదీ పరిస్థితి. ఆ కుటుంబానికి నమస్కరించి నాకు సెలవిప్పించమన్నాను. ఇదంతా వాళ్ళకేం తెలుసు, ఒకవేళ తెలిసినా నమ్మరు. మందుచీటీలు రాసినంత సులువు కాదు జనంతో మసలుకోవటమంటే. ప్రస్తుతానికి ఇక్కడ నా వల్ల అయిందంతా చేశాను, మళ్లా అనవసరంగా కబురుపెట్టి రప్పించారు, నాకిది అలవాటైపోయింది, ఈ తాలూకా మొత్తం నన్ను చిత్రహింస పెట్టడానికే నా రాత్రిబెల్లును వాడుకుంటోంది, కానీ ఇప్పుడు నా రోజీని కూడా బలిపెట్టాల్సి వచ్చింది – చాలా ఏళ్ళుగా నా ఇంట్లోనే ఉంటూ కూడా నా గుడ్డికళ్ళకు ఆనని అందమైన రోజీని బలిపెట్టాల్సి రావడమంటే – అది భర్తీ కానంత పెద్ద నష్టం, కానీ అదేమంత పెద్దది కాదని నన్ను నేను నమ్మించుకోవాలి,



లేదంటే ఆ కోపాన్ని ఈ కుటుంబం మీద వెళ్ళగక్కేయగలను, ఏం ప్రయోజనం, ఈ కుటుంబమంతా తలకిందులుగా తపస్సు చేసినా నా రోజీ నాకు తిరిగిరాదు. నేను నా సంచీ సర్దేసుకుని, ఉన్నికోటు తెమ్మని సైగ చేసే సరికి, కుటుంబమంతా నా చుట్టూ గుమికూడింది, తండ్రి తన చేతిలో రమ్ము గ్లాసు వాసన చూస్తున్నాడు, తల్లేమో బహుశా నా వల్ల ప్రయోజనమేం లేదన్న నిరాశతో కాబోలు (అసలేం ఆశిస్తారీ జనం?) తన పెదాలు కొరుక్కుంటూ ఏడుస్తోంది, చెల్లెలేమో రక్తంతో తడిసిన జేబురుమాల్ని నా కళ్ల ముందు ఆడిస్తోంది. నిజమే, ఒప్పుకోక తప్పదు, ఆ అబ్బాయి కాస్త అనారోగ్యంగానే ఉన్నాడు. అతని వైపు నడిచాను. అక్కడికి, నేనేదో పాయసం తీసుకువస్తున్నట్టు అతను నా వంక చూసి నవ్వుతున్నాడు, – అప్పుడే ఈ మాయదారి గుర్రాలు మళ్ళీ సకిలించడం మొదలుపెట్టాయి; రోగికి నేను చికిత్స చేస్తూంటే ఇలా సకిలింపులతో సాయపడమని బహుశా వాటికి పైనుంచి ఎవరో ఆదేశాలు పంపారేమో – అదిగో అప్పుడు కనపడింది: ఆ అబ్బాయి పరిస్థితేం బాలేదు. అతని కుడి పక్కన, పిరుదుల పైన, నా అరచేయంత పెద్దగా ఒక తాజా గాయం ఉంది. వేర్వేరు గులాబీ ఛాయల్లో ఉంది, మధ్యలో ముదురు రంగులో ఉండి, అంచుల వైపు వచ్చే కొద్దీ లేతగా మారింది, రజను తాపడం చేసినట్టు మృదువైన గరుకుదనంతో ఉంది, అక్కడక్కడా రక్తం ఊరుతోంది, మొత్తం మీద ఒక గని ముఖద్వారంలా బాహటంగా తెరుచుకుని ఉంది. ఇదంతా దూరం నుంచి చూస్తే కనిపించేది. దగ్గరకి వెళ్లే కొద్దీ దృశ్యం మరింత సంక్లిష్టంగా మారింది. ఆశ్చర్యంతో ఈల వేయకుండా ఉండలేకపోయాను. ఆ గాయంలో పురుగులు మెలికలు తిరుగుతున్నాయి, నా చిటికిన వేలంత పొడవుగా లావుగా ఉన్నాయి, చిన్నటి తెల్లని తలలతోను, బోలెడన్ని పొట్టి కాళ్ళతోను ఉన్నాయి, వాటి గులాబీరంగు శరీరాలకు అక్కడక్కడా రక్తం అంటుకుని ఉంది. క్షమించు తమ్ముడూ, నిన్నిక ఏ సాయమూ కాపాడలేదు. నీ ఘనమైన గాయాన్ని కనిపెట్టాను; నీ పక్కన పూచిన ఈ పువ్వు నిన్నిక మట్టుబెట్టక మానదు. నేను పనిలో పడటం గమనించి ఆ కుటుంబ సభ్యులు సంతోషించారు; చెల్లి తల్లికి చెప్పింది, తల్లి తండ్రికి చెప్పింది, తండ్రి అప్పుడే లోనికి వస్తున్న అతిథులకు చెప్తున్నాడు; వాళ్ళు మునివేళ్ల మీద నడుస్తూ బాలెన్స్ కోసం చేతులు బారజాచి బయట వెన్నెల్లోంచి గుమ్మంలోకి అడుగుపెడుతున్నారు. తన గాయంలో జీవసంచలనాన్ని చూసి ఆ అబ్బాయికి కళ్ళు బైర్లు కమ్మినట్టున్నాయి, “నన్ను రక్షిస్తారు కదూ?” అంటూ ప్రాధేయపూర్వకంతా అడుగుతున్నాడు. ఇదీ ఈ తాలూకాలో జనం తీరు! తమ వైద్యుణ్ణించి

అసాధ్యాల్ని ఆశిస్తారు. వీళ్ళ పాటికి వీళ్ళు పాత విశ్వాసాలన్నీ విడిచిపెట్టేశారు; మతపూజారి ఇంట్లోనే ఉండి తన పవిత్రవస్త్రాలు ఒక్కొక్కటిగా చింపుకుంటుంటాడు; కానీ వైద్యుడు మాత్రం వీళ్ళ కోసం శస్త్రచికిత్సలో ఆరితేరిన తన చురుకైన వేళ్ళతో అద్భుతాలు చేసి పెట్టాలి. అయినా ఏమైతే నాకెందుకు: ఇక్కడకు నా అంతట నేను రాలేదు; ఒకవేళ పవిత్ర క్రతువుల కోసం నన్ను దుర్వినియోగం చేయాలనుకుంటే, అది వాళ్ళ ఇష్టం, నేనేం కాదనను; నాకంతకన్నా మిగిలిందేముంది, ముసలి పల్లెటూరి వైద్యుణ్ణి, నా పనమ్మాయిని పోగొట్టుకున్నవాణ్ణి! ఇదిగో వస్తున్నారు, రోగి కుటుంబమూ, పల్లెటూరి పెద్దలూ కలిసి, నా బట్టలు విప్పుతున్నారు; ఒక బడి తాలూకు ప్రార్థనాగీతాల బృందం తమ టీచరుతో సహా వచ్చి ఇంటి ముంగిట నిలబడి తేలికైన బాణీలో ఈ పంక్తులు పాడుతున్నారు:

బట్టలు విప్పండి, వైద్యం చేస్తాడు చూడండి,
చేయకుంటే చంపండి!
వైద్యుడే కదా, వట్టి వైద్యుడే కదా!

నా బట్టలు విప్పేశారు, నేను తల ఓ పక్కకి వాల్చి, గడ్డాన్ని వేళ్ళతో నిమురుకుంటూ, ఆ జనం వైపు నిశ్శబ్దంగా చూశాను. నేను ఏమాత్రం తొణకలేదు, తల్చుకోవాలేగానీ వీళ్లందరికీ సమవుజ్జీని, కానీ లాభం లేకపోయింది, వాళ్ళు నా తలనీ కాళ్ళనీ పట్టుకుని మంచం దగ్గరకు మోసుకుపోయారు. నన్ను గోడ వైపు ఆ అబ్బాయి పక్కన గాయం ఉన్న వైపే పడుకోబెట్టారు. తర్వాత అందరూ గదిలోంచి బయటకు వెళ్ళిపోయారు; తలుపు మూసుకుపోయింది; పాట వినిపించటం మానేసింది; చంద్రుణ్ణి మేఘాలు కమ్మేశాయి; పక్కబట్టల వెచ్చదనం నన్ను ఆవరించింది; తెరిచిన కిటికీలోంచి గుర్రాల తలలు నీడల్లా కదులుతున్నాయి. “నీకు తెలుసా,” అంటూ పక్కనుంచి ఓ గొంతు నా చెవిలో మాట్లాడింది, “నాకు నీ మీద పెద్ద నమ్మకమేం లేదు. నువ్వు ఎక్కణ్ణించో లాక్కురాబడటం వల్ల ఇక్కడకొచ్చి పడ్డావు, నీ కాళ్ల మీద నువ్వు రాలేదు. ఇప్పుడు నాకు సాయం చేయకపోగా, నా మరణశయ్యని మరింత ఇరుకు చేస్తున్నావు. వీలైతే నీ రెండు కళ్ళూ పెరికేయాలని ఉంది.” “అవున్నిజమే,” అన్నాన్నేను, “ఇది సిగ్గుచేటే. కానీ నేనొక వైద్యుణ్ణి. ఏం చేయగలను. నమ్ము నమ్మకపో, నా పనీ అంత సులువేం కాదు.” “అంటే ఈ ఒక్క క్షమాపణతో ఇక నేను సమాధానపడిపోవాలా? అంతేలే, అంతకన్నా ఏం చేయగలను. నా బతుకంతా ఏది

దక్కితే దానితో సమాధానపడటమే. నాతో పాటూ ఈ ప్రపంచంలోకి తెచ్చుకున్నదల్లా ఈ అందమైన గాయం మాత్రమే; ఇదే నాకు సంక్రమించిన ఏకైక ఆస్తి.” “తమ్ముడూ,” అన్నాన్నేను, “నీ పొరబాటేంటో తెలుసా: విషయాన్ని విశాల దృక్పథంతో చూడలేకపోవటం. ఎందరో రోగుల గదుల్లోకి వెళ్ళి వచ్చినవాణ్ణి, నేను చెప్తున్నా విను: నీ గాయం మరీ ఏమంత ప్రమాదకరం కాదు. రెండు తేలికపాటి గొడ్డలి వేటులు పడ్డాయి. చాలామంది అడవిలో వళ్లంతా అప్పజెప్పి నిలబడినా ఎప్పుడూ గొడ్డలి శబ్దమే వినరు, ఇక అది వారి వైపుకి రావటమన్న ప్రశ్నయితే అస్సలు లేదు.” “నిజమే చెప్తున్నావా, లేక జ్వరంతో ఉన్నాను కదాని మాయచేస్తున్నావా?” “నిజమే చెప్తున్నాను, ఒక వైద్యుడు అధికారికంగా ఇస్తున్న మాట ఇది.” అతనా మాట విని, మెదలకుండా పడుకున్నాడు. ఇక నేను తప్పించుకోవటానికి దారి వెతుక్కోవాలి. గుర్రాలింకా తమ స్థానాల్లోనే నిల్చుని ఉన్నాయి. నా బట్టలు, ఉన్నికోటు, సంచీ అన్నీ వెంటనే తీసుకున్నాను; బట్టలేసుకోవటానికి సమయం వ్యర్థం చేయటం ఇష్టం లేదు; గుర్రాలు గనక ఇక్కడకు తెచ్చినంత వేగంగానే ఇంటికి తీసుకుపోగలిగినట్లయితే, ఈ మంచం మీంచి దిగిన మరుక్షణం నా మంచం మీద ఉంటాను. ఒక గుర్రం వినయంగా కిటికీ నుంచి వెనక్కు కదిలింది; అన్నీ మూట కట్టేసి బండిలోకి విసిరాను; ఒక్క ఉన్నికోటు మాత్రం గురి తప్పి బండికున్న కొక్కెపు అంచుని పట్టుకు వేలాడుతోంది. ఆ మాత్రం ఆధారం చాలు. గుర్రం మీదకు ఎక్కాను. పగ్గాలు వదులుగా వేలాడుతున్నాయి, గుర్రాల్ని కలిపే లంకె ఊడిపోయింది, వెనకాల బండి అటూ ఇటూ ఊగుతోంది, బండి చివర్న నా ఉన్నికోటు మంచులోకి దేకుతోంది. “హెయ్య!” అన్నాన్నేను, కానీ ఉరుకులూ పరుగులూ ఏంలేవు; ఈసురోదేవుడా అన్నట్టు నెమ్మదిగా, ఆ మంచు విస్తారాల్లో ఈడిగిలపడుతూ కదిలాం; అసలువిషయం తెలియని ఆ బడిపిల్లలు పాడుతున్న ఒక కొత్త పాట మా వెనక చాలాసేపటి దాకా వినిపిస్తూనే ఉంది.

సంతసించుము, అస్వస్థులారా,
వైద్యుడు మీతోనే ఉన్నాడు, మీ పక్కలోనే ఉన్నాడు!

ఈ వేగంతో ఐతే ఎప్పటికీ ఇంటికి చేరలేను; నా పుష్కలమైన ప్రాక్టీసు ఇక ముగిసినట్టే; నా తదనంతరం వచ్చేవాడు దాన్ని లాగేసుకుంటాడు, కానీ వాడు నా స్థానాన్ని ఎప్పటికీ భర్తీ చేయలేడు; అదెలా ఉన్నా అక్కడ నా ఇంటికి ఆ మోటు గుర్రాలవాడు నాశనం చేస్తున్నాడు; రోజీ వాడికి

బలైపోతోంది; ఆ ఆలోచనే దుర్భరంగా ఉంది. అన్ని కాలాల్లోనీ నికృష్టమైన ఈ కాలంలో, మంచులో, నగ్నంగా, ఒక సాధారణమైన బండిలో, దాన్ని లాగుతున్న అసాధారణమైన గుర్రాలతో, ముసలివాణ్ణయిన నేను, ఇలా దారి తప్పిపోతున్నాను. నా ఉన్ని కోటు బండి వెనక వేలాడుతోంది, అది నాకు అందటం లేదు, నాకున్న ఇంతమంది రోగుల్లో ఒక్కడూ నా సాయానికి ముందుకురాడు. మోసపోయాను! మోసపోయాను! తప్పుగా మోగిన రాత్రిబెల్లుకు ఒక్కసారి స్పందిస్తే చాలు, మళ్లీ బాగుపడటం సాధ్యం కాదు — ఎప్పటికీ!

★

For Latest Telugu Books - Visit now:

Kinige.com